సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - నిడదవోలు

మంత్రితో మాట్లాడుతున్న జువ్వల

పట్టణంలో నెలకున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు కోరారు. బుధవారం స్థానిక మంత్రి కార్యాలయంలో ఆయన మంత్రిని కలిసి పట్టణంలో పలు సమస్య లు పరిష్కరించాలని కోరారు. పట్టణంలో తక్షణమే రైతు బజార్ ఏర్పాటు చేయాలని, స్థానిక చర్చిపేట 7, 8 వార్డుల సచివాలయం పక్కన ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో అంబేద్కర్ స్టడీ సెంటర్ లేదా గ్రంథాలయంను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు జువ్వల రాంబాబు తెలిపారు.

- బదిలీ అయిన టీచర్లకు రెండు నెలల బకాయిలు
- పొజిషన్ ఐడిల కేటాయింపులో అలసత్వం
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

వేతన వెతలు!

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాల విద్యాశాఖలో జరిగిన బదిలీల్లో స్థానచలనం కలిగిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. వారికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకుండా నానా అవస్థలకు గురిచేస్తోంది. బదిలీలను సాకుగా చూపి జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి విద్యాశాఖను గాలి కొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 1,500 మంది ఉపాధ్యాయుయలు ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 6,583 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు.. గ్రేడ్-2 ప్రధానోపాధ్యా యులు 178 మందికి, మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా 284 మందికి, స్కూల్ అసిస్టెంట్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులు 3,298 మందికి, సెకండరీగ్రేడ్. సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 2,995 మందికి ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు 32 మందికి ఆర్ట్/ డ్రాయింగ్ క్రాఫ్ట్/ మ్యూజిక్/ ఒకేషనల్ ఉపాధ్యాయులు 20 మందికి స్థాన చలనం కలిగింది. టీచర్లతో పాటు, రేషనలైజేషన్ కారణంగా కొన్ని పోస్టుల ఏర్పాటు, నూతనంగా ఏర్పడిన వివిధ పోస్టులు, మోడల్ ప్రైమరీ హెచ్‌ఎం పోస్టులు, ఆ హెచ్‌ఎం పరిధిలో వనిచేస్తున్న టీచర్లకు ఇలా బదిలీలు జరిగాయి.

తక్షణమే వేతనాలు చెల్లించాలి

ఉపాధ్యాయుల బదిలీల్లో స్థాన చలనం కలిగిన ఉపాధ్యా యులకు ఇంకా జీతాలు అంద లేదు. తీవ్ర జాప్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. తక్షణమే ప్రభుత్వం స్పందించి పొజిషన్ ఐడీలు జారీచేసి ఉపాధ్యాయులకు త్వరిత గతిన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదు

- చిలుకూరి శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి

సాధారణంగా జూన్, జులైల జులైల ప్రతి కుటుంబంలో ఖర్చులు సాధారణ నెలల కంటే ఎక్కువగా ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూల్ ఫీజులు, విద్యా సామగ్రి కోసం రూ.వేలల్లో వెచ్చించాల్సి ఉంటుంది. అలాగే బదిలీ జరిగిన ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, కొత్త ఇంటి అడ్వాన్సులు, ఇంటి అద్దెలు రూపంలో మరింత ఖర్చు పెరుగుతుంది. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారైతే ఇంట్లో వ్యవసాయం ఉంటే విత్తనాలు, ఎరువులు, దుక్కులకు చాలా ఖర్చులు చేయాల్సి ఉంటుంది. వీటిన్నింటికితోడు జీతాలు రాక పోవడంతో ఇప్పటికే తీసుకున్న పర్సనల్ లోన్, హౌసింగ్ లోన్ వంటి వాయిదాలు చెల్లించకపోవడంతో చెక్ బౌన్స్ అవుతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వ బదిలీల కారణంగా ఉపాధ్యాయుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే... చొరవ తీసుకుని అధికారులను అప్ర మత్తం చేసి న్యాయం చేయాల్సిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కనీస జాడ కనిపించడం లేదని వారు వాపోతున్నారు. తమ శాఖకు చెందిన అధికారులే తమని పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, సాధారణంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డిడిఒకు సమాచారం అందిస్తారు. ఇందు కోసం ఉద్యోగులకు పొజిషన్ ఐడీలు కేటాయించాలి. ఈ తతంగాన్ని ప్రభుత్వమే పూర్తి చేయాలి. గత నెల 15వ తేదీ లోగా అన్ని కేడర్ల ఉపాధ్యాయుల బదిలీలను ప్రభుత్వం పూర్తి చేసింది. ఇది జరిగి నెలరోజులు దాటిపోయింది. ఇప్పటికీ ఉపాధ్యాయులకు పొజెషన్ ఐడీలు కేటాయించ లేదు. దీంతో, జూన్ నెలకు సంబంధించి జూలైలో రావాల్సిన జీతాలు ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు అందలేదు. అలాగే జులై నెలకు సంబంధించిన జీతాలు ఆగస్ట్ మొదటివారంలో అందుకునే అవకాశం కూడా ప్రస్తుత పరిస్థితుల్లో లేనట్టేనని గగ్గోలు పెరుతున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రస్థాయిలో... పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా అతీగతి లేదని సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు

సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అవసరమయ్యే సమయానికి చేతిలో చిల్లి గవ్వ లేక, మరొకరిని అప్పులు అడగలేక సతమతమవుతున్నారు. కష్టపడి పనిచేసినా వేతనాలు అందించకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కార్మికుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు

సత్యసాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా ప్రాజెక్టు కార్మికులకు తక్షణమే బకాయి వేతనాలను చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్. పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. లాలాచెరువు జంక్షన్‌లోని ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద గత 23 రోజులుగా సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బుధవారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గత 19 నెలలగా వేతనాలు లేక కార్మికులు ఆకలి కేకలతో సమ్మెబాట పట్టారని అన్నారు. 25 నెలలగా ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వానికి 23 రోజులుగా బకాయి వేతనాల కోసం సమ్మె చేస్తున్న కార్మికులు కన్పించడం లేదని విమర్శించారు. కార్మికుల సమ్మెతో ఐదు మండలాల్లో సుమారు 85 గ్రామాలకు గోదావరి నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని అన్నారు. సుమారు మూడు లక్షల మంది గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించి కార్మికులకు బకాయి వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీను, ఇసాక్, కోశాధికారి కె.రామకృష్ణ, కార్మికులు రామకృష్ణ, సుబ్బారావు, శేషారావు, వీరబాబు, మల్లేశ్వరరావు, రాధాకృష్ణ, మల్లిరెడ్డి, అర్జున్, సత్యనారాయణ, సురేష్, కృష్ణారెడ్డి, దొరబాబు, రాజు, శ్రీను, ప్రసాద్, పాల్గొన్నారు.

3,801 మందికి వితంతు పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వ్యాప్తంగా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లతోపాటు, వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఆగస్టు 1వ తేదీన ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 2,36,331 లబ్ధిదారులకు రూ.1032.62 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ కోసం మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 3,801 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వీరికి రూ.1.52 కోట్లు విడుదల చేయడం జరిగిందని వివరించారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో వీరికి పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్తగా రాజమహేంద్రవరం అర్బన్‌లో 443 మందికి, అనపర్తి 169, బిక్కవోలు 194, చాగల్లు 137, దేవరపల్లి 194, గోకవరం 158, గోపాలపురం 163, కడియం 184, కోరుకొండ 223, కొవ్వూరు 140, కొవ్వూరు (అర్బన్) 57, నల్లజర్ల 168, నిడదవోలు 157, నిడదవోలు (అర్బన్) 70, పెరవలి 165, రాజమహేంద్రవరం (రూరల్) 284, రాజానగరం 256, రంగంపేట 174, సీతానగరం 187, తాళ్లపూడి 109, ఉండ్రాజ వరం 169 మందికి మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. సకాలంలో ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేలా మున్సిపల్, పంచాయతీ, సచివాలయ స్థాయి ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు.

నామినేషన్‌ను దాఖలు చేస్తున్న పద్మావతి

సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పద్మావతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థినిగా మారిశెట్టి పద్మావతి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇక్కడ సర్పంచ్‌గా గెలుపొందిన మార్గాని అమ్మాణి 2023వ సంవత్సరంలో ఆకస్మికంగా మృతి చెందడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న పాఠంశెట్టి రాంజీ ఇన్‌ఛార్జ్ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం పంచాయతీ సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆగస్టు 10 వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మృతి చెందిన సర్పంచ్ మార్గాని అమ్మాణీ కుమార్తె మారిశెట్టి పద్మావతి సర్పంచ్‌గా నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏక గ్రీవం దిశగా మంతనాలు

కడియపులంక గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా మంతానలు జరుగుతున్నాయి. సర్పంచ్ అభ్యర్థి మారిశెట్టి పద్మావతి తరపున ఆమె తండ్రి పంచాయతీ వార్డు సభ్యుడు మార్గాని ఏడుకొండలు పార్టీల కతీతంగా పలువురు పెద్దలను కలిసి ఏకగ్రీవానికి సహకరించాలని అభ్యర్థిస్తున్నట్లు సమాచారం. గ్రామ పెద్దల సహకారంతో మారిశెట్టి పద్మావతి ఏకగ్రీవం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కార్టూ'నిజం'



ఉపాధ్యాయులపై పని భారం దారుణం : ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి - పెరవలి

కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులపై పని భారాన్ని పెంచుతూ విద్యార్థులకు చదువును దూరం చేస్తుందని ఎంఎల్‌సి గొర్రా గోపిమూర్తి అన్నారు. బుధవారం పెరవలిలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు, పాఠశాలల్లో నెలకున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా డే, మెగా పేరెంట్స్ డే పేరిట ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం పని భారాన్ని పెంచడం దారుణమన్నారు. పలు రకాల ఆన్‌లైన్ పనుల వల్ల ఉపాధ్యాయులు బోధనేతర పనుల్లో చిక్కుకుపోతున్నారు. తద్వారా విద్యార్థులను ప్రభుత్వమే చదువుకు దూరం చేస్తుందని విమర్శించారు. ఉపాధ్యాయులు బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 11వ పిఆర్‌సిని రివర్స్‌గా అమలు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే 12వ పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. పింఛనుదారులకు గ్రాట్యూటీ మొత్తాన్ని విడుదల చేయాలని, సరెండర్ లీవులు, డిఎలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలు తెలుసుకుంటూ, పలు కీలక విషయాలపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.వెంకటరమణ, జిల్లా కౌన్సిలర్ ఎం.శేఖర్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి డివిఎస్‌ఆర్ తారా కృష్ణ, మండల గౌరవ అధ్యక్షుడు విఎన్‌వి.సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి గోపిమూర్తికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

మానవ అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మానవ అక్రమ రవాణాపై ఖఠినమైన చర్యలు ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం చైల్డ్ వెల్ఫేర్, విద్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో జిల్లా కోర్టు ఆవరణలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ 1987లో ఏర్పడిందని అన్నారు. నాటి నుంచి పలు ప్రజాపయోగి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని తెలిపారు. 2015 నుంచి మానవ అక్రమ రవాణా, బాల కార్మికుల వాడకం, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, కిడ్నాప్ తదితర చట్టవ్యతిరేక చర్యలపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారుల్లో, ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పోలీస్, విద్య, బాలల సంక్షేమ శాఖల అధికారులు తమ విధులు నిర్వర్తించడమే కాకుండా సమాజంలో జరుగుతున్న చట్టవ్యతిరేక చర్యలపై కూడా స్పందించి ప్రజలకు సరైన దిశా నిర్దేశనం చేయాలని అన్నారు. తాజాగా కొన్ని గ్రామాలలో బాల్య వివాహాల సమాచారం తమ దృష్టికి వచ్చిందని, పంచాయతీ కార్యదర్శులకు ఇటువంటి ఘటనలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని వివరించారు. ఈ సందర్భంగా ప్రపంచ మానవ అక్రమ రవాణా నివారణ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న, డిఇఒ కె.వాసుదేవరావు, ఐసిడిఎస్ పీడీ సిహెచ్.లక్ష్మి, ఇతర శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఇతరులు

టిబి ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - కడియం, గోకవరం

కడియం పిహెచ్‌సిలో టిబి ముక్తి అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర పాల్గొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిబి సోకినవారికి 6, 9, 18 నెలల పాటు పూర్తిగా చికిత్స ఉచితమని, నెలకు రూ.1000 చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయాన్నారు. 100 మంది టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్న సర్వారాయ షుగర్స్ లిమిటెడ్ ప్రతినిధి హెచ్‌ఆర్. శ్రీధర్‌ను ఆమె అభినందించారు. శ్రీధర్ మాట్లాడుతూ కంపెనీ ద్వారా పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.మాధురి, టిబి సూపర్‌వైజర్లు శేషు, మహేష్, సృజనకుమారి, భాగ్యలక్ష్మి, భీమరాజు శ్రీనివాస్, సతీష్ బాబు, రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గోకవరం మండలం ఇంటికాయల పల్లి గ్రామంలో టిబి ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దార రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ టిబి వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా టిబి వ్యాధిపై ఎస్‌టి ఎస్.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ పవన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 98 మందిని పరీక్షించి వారిలో 17 మంది నుంచి కళ్లే పరీక్షకు శాంపిల్స్‌ను సేకరించారు. అలాగే స్థానిక ఎంపిపి యుపి పాఠశాలలో విద్యార్థులకు టిబి లక్షణాలు, తీసుకోవసిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ఒ. కరుణాకర్, ఎఎన్ఎం మంగ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీదేవి

1న స్వమిత్వ సర్వేపై గ్రామ సభలు

ప్రజాశక్తి - చాగల్లు

స్వమిత్వ ఫేస్-2 సర్వేకు ఎంపికైన గ్రామాల్లో ఆగస్టు 1న గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అన్నారు. బుధ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్య దర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వమిత్వ ఫేస్-2 సర్వే కోసం మండలంలోని చాగల్లు, చిక్కాల బ్రాహ్మణగూడెం, కలవలపల్లి, దారవరం, మల్లవరం, గౌరీపల్లి, చంద్ర వరం, ఉనగట్ల గ్రామాలు ఎంపికయ్యాయని తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీలలో ఆగస్టు 1న గ్రామసభలు నిర్వహించి, స్వమిత్వ సర్వేని ప్రారంభించాలని అన్నారు. సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసేలా ఆయా గ్రామాల్లో టామ్- టామ్ వేయించాలని తెలిపారు. ఈ గ్రామ సభలకు గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలను ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ ఆర్ శ్రవణకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మండలంలోని సత్యవాడ గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపిడిఒ వివివిఎస్. రామారావు పరిశీలించారు. బుధ వారం తెల్లవారుజామున సత్యవాడ గ్రామానికి చేరుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కల నివారించేందుకు గడ్డి మందు పిచికారి విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త వాహనంతో పాటు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వేరువేరుగా అందిస్తున్నదీ, లేనిదీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బదిలీ అయిన సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్

మండలంలోని గజ్జరం సచివాలయం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. బుధవారం గజ్జరం పంచాయతీ సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు ఆధ్వర్యంలో బదిలీ అయిన పలువురు సచివాలయం సిబ్బందిని సన్మానించారు. గ్రామ ప్రజలకు చేసిన సేవలను సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కమిటీ నియామకం

ప్రజాశక్తి - గోకవరం

జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రకటించారు. అభివృద్ధి కమిటి ఛైర్మన్‌గా టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, సభ్యులుగా ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రరావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, కొర్పు సాయితేజ, జంపన సీతారామచంద్ర వర్మ, చదరం గోవిందరాజులు, కంచుమర్తి రాఘవ, హాలోనిన్ ప్రశాంత్‌కుమార్, జనపరెడ్డి సుబ్బారావు, బత్తుల సత్తిబాబులను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల నుంచి ఈ కమిటీలో సభ్యులను నియమించడం జరిగిందని తెలిపారు.

వితంతువుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - పెరవలి

వితంతువుల పింఛన్ల పట్ల అధికారులు నిర్లక్ష్యం తగదని మాజీ వైస్ ఎంపిపి సిహెచ్.వెంకటనారాయణ అన్నారు. మండలంలోని నడిపల్లి గ్రామంలో ఆరుగురు వితంతువులు పింఛన్ల మంజూరు కాక సచివాలయం, ఎంపిడిఒ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వితంతువుల పింఛన్లపై మండల పరిషత్ అధికారులను ఆయన కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భర్త పింఛను పొందుతూ మృతి చెందడంతో ఆ పింఛన్ భార్యకు బదిలీ చేయకపోవడంతో గత మూడేళ్లగా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వితంతు పింఛన్లపై మంజూరుపై దృష్టి పెట్టకపోవడంతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నాయకులు వితంతువులు నిలదీస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ పొందిన లబ్ధిదారుడు మృతి చెందగా ఆ పింఛన్‌ను ఆయన భార్యకు బదిలీ కావడం లేదన్నారు.గ్రామానికి చెందిన భావన నాగమణి, గురజాలక్ష్మిల భర్తలు మృతి చెంది మూడేళ్లు అయిందని, వారికి నేటికీ వితంతు పింఛన్ అందడం లేదన్నారు. గత ప్రభుత్వం నుంచి పింఛన్ కోసం తిరుగుతున్న వితంతువులకు పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మురమండ జూనియర్ కళాశాలలో బుధవారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం సదస్సు జరిగింది. ఈ సదస్సులో మహిళా ఎస్ఐ పి.ధనలక్ష్మి మాట్లాడుతూ ఫోక్సో చట్టం పిల్లల హక్కులను కాపాడుతుందని, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుందని తెలిపారు. పోక్సో చట్టంతో పాటు, సైబర్ నేరాలు, గంజాయి వలన కలిగే దుష్ఫలితాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యను చంపిన భర్త అరెస్టు

ప్రజాశక్తి - రాజానగరం

భార్యను అతికిరాతకంగా హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డిఎస్‌పి వై.శ్రీకాంత్ వెల్లడించారు. నర్సీపట్నం మండలం గిడుగూరుకు చెందిన వేమగిరి మాణిక్యానికి కొంతమూరుకు చెందిన ఉషారాణికి పదేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు నిహాంక్, ఏడేళ్ల కుమార్తె నిస్సీ ఉన్నారు. కొంతమూరులో ఆమె తల్లి నల్లమాటి లక్ష్మి నివాసం ఉంటున్న ప్రక్క వీధిలో వీరు జీవిస్తున్నారు. ఇద్దరి మధ్య కొన్ని రోజులకు మనస్పర్థలు వచ్చి తరచూ గొడవలు పడుతున్నారు. దీంత నెలరోజుల క్రితం పోలీసు స్టేషన్‌లో భర్త మాణిక్యంపై భార్య ఉషారాణి ఫిర్యాదు చేసింది. అప్పటి నుండి భర్త ఇంటికి రాకుండా బయట తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ రాత్రి మాణిక్యం ఇంటికి వచ్చి ఉషారాణితో గొడవ పడి నాపరాయితో ముఖంపై బలంగా కొట్టడంతో భయపడిన వారి పిల్లలు పక్క వీధిలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి పరుగులు తీశారు. అమ్మమ్మకు జరిగిన విషయం చెప్పడంతో ఆమె సంఘటనా ప్రాంతానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న కుమార్తెను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించింది. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే అప్పటి నుంచి పరారీలో ఉన్న మాణిక్యంను బుధవారం కొంతమూరు బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. కేవలం రెండు రోజుల్లో నిందితుడుని అరెస్టు చేసిన సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ కెవి.నాగార్జున, హెడ్ కానిస్టేబుల్స్ సురేష్‌బాబు, రాంప్రసాద్, కానిస్టేబుల్ అశోక్‌లను ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రాజమహేంద్రవరం కోటిలింగాల పేటలో నివాసం ఉంటున్న బత్తుల చిట్టిరాజు(50) కోరుకొండ మండలం గుమ్మళ్ళదొడ్డిలో ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి ప్రతి రోజు మోటారు సైకిల్‌పై వెళుతుంటాడు. ఇందులోభాగంగానే బుధవారం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న అతనిని కొంతమూరు వద్ద టిప్పర్ లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం: ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నల్గొండ గ్రామ శివారులో 2.57 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో బుధవారం నల్గొండ గ్రామ శివారు మామిడి తోట వద్ద నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను గుర్తించి విఆర్‌ఓ సమక్షంలో వారిని తనిఖీ చేసినట్లు చెప్పారు. వారి వద్ద ఐదు ప్యాకెట్లలో ఉన్న సుమారు 2.57 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందుతులంతా నల్లగొండ గ్రామానికి చెందిన చింతల గంగరాజు(29), బండారు అప్పన్నదొర(50), బొబ్బిల్లంక గ్రామానికి చెందిన పోలిన సాయిసతీష్ (19), రాజానగరం మండలం తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్(20), కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన నేరుమల్లి అఖిల్(21)గా గుర్తించినట్లు తెలిపారు. వీరు ఒడిస్సా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్స్‌గా చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ డి.రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుని మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిన్నకొండేపూడిలో ఒక భవనానికి పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందకు పడి ఒక కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగవరం గ్రామానికి చెందిన అల్లం సత్యజ్ఞానకుమార్(46) చినకుండేపూడి గ్రామానికి చెందిన లేఖరి తిరుపతిరావు నూతన భవనానికి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం యథావిధిగా పని ప్రదేశానికి చేరుకుని పెయింటింగ్ పని ప్రారంభించాడు. పని చేసే క్రమంలో ఆ కార్మికుడు భవనం పై నుంచి కిందకు పడిపోయాడు. ఇంటి యజమాని ఉదయం ఏడు గంటలకు కుటుంబ సభ్యులకు తెలియచేయగా, వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని రఘుదేవపురంలో ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ కార్మికుడు మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. మృతుడు భార్య అల్లం దేవిభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంకుమార్ వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు.

దాడి కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్‌లో 2024 సంవత్సరంలో జరిగిన దాడి కేసులో ముద్దాయికి న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..మాధవరాయుడుపాలెం చైతన్య నగరకు చెందిన ముద్దాయి ముంజేటి సురేష్ మద్యం మత్తులో డ్రింక్ సీసాతో అదే గ్రామానికి చెందిన బొల్ల ధనుంజయపై దాడి చేశాడు. గాయపడ్డ ధనుంజయ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ టి.కృష్ణసాయి కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి రాజమహేంద్రవరం 8 వ అదనపు జిల్లా కోర్టులో వాదోపవాదాలు జరగగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వై. బెన్నయ్యనాయుడు ముద్దాయికి 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలను జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి: కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆదాయ వనరుల పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్, కమిషనర్(ఎఫ్ఎసి) పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నగర అభివృద్ధిపై సంబంధిత శాఖాధిపతులతో సమీక్షించారు. గతేడాది ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ నగరంలో రూ. 88 కోట్లు కాగా.. ఈ ఏడాది కనీసం 10 శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హౌస్ టూ హౌస్ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేసి.. డిమాండ్ రైజింగ్‌ను ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి 65 శాతం వసూళ్లు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలన్నారు. అనంతరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. శాంక్షన్ అయిన పనులను త్వరగా పూర్తి చేయాలని, కార్యాచరణలో అభివృద్ధి కనపడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణం, డ్రెయిన్ టూ డ్రెయిన్ జరగాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు త్వరగా జరిగేలా చూడాలన్నారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణం డిశంబర్ నాటికి పూర్తవుతుందని ఈ సందర్భంగా ఎస్ఇ వివరించారు. సి అండ్ డి వేస్టును ప్రజలు నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రదేశాలలోనే పడవేసేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల నిర్వహణపై చర్చించారు. ఆహారం తిన్నాక క్యాంటీన్‌లో కల్పించిన సౌకర్యాలు, ఆహార శుచి, రుచి ఎలా ఉందో లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. తదనంతరం నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్, డీసిల్టేషన్ పనులపై పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడారు. వీధి వ్యాపారులకు సంబంధించి వారి జీవనోపాధికి భంగం కలగకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్లు, డ్రెయిన్ల మీద వ్యాపారాలు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అటువంటి వారిని గుర్తించి చినట్లయితే లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమా వేశంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఇంజి నీరింగ్ ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఎంహెచ్ఒ వినూత్న, రెవెన్యూ అధికారులు సిహెచ్. శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, సిఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

రక్తదానానికి దాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన రక్తాన్ని దానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని తహశీల్దార్ అజయ్‌బాబు, ఎస్ఐ శివగణేష్, ఎంపిడిఒ రాజ్‌మనోహర్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక శార్వాణి రెసిడెన్షియల్ డిజిటల్ స్కూల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేసేందుకు, గర్భిణీ స్త్రీలకు, ప్రమాదంలో జరిగినప్పుడు అత్యవసర సమయాలలో, ఇతర వ్యాధిగ్రస్తులకు వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఎంతో అవసరమని అన్నారు. పలు సందర్భాలలో అత్యవసర సమయాలలో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ శిబిరంలో 130 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో జక్కంపూడి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్త సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా ఛైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షులు ఫణికిషోర్, జిల్లా బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ జోడల్ వెంకటేశ్వరరావు, మండల సభ్యులు నెల్లి చంద్రశేఖర్, కృపావర ప్రసాద్, రాధాకృష్ణ, కీర్తి కుమార్, గుబ్బ లక్ష్మణరావు, హేమంత్, కాట్రు తారకరమేష్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

లక్ష్యాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలు: కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో గృహ నిర్మాణాలు జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ నిర్మాణాల లక్ష్యంలో దిగువ స్థానంలో ఉన్న ఐదు మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన అదనపు ఆర్థిక సహాయాన్ని గృహ నిర్మాణాల్లో సమర్ధవంతంగా వినియోగించుకోవాలని, పనుల పురోగతిలో స్పష్టమైన మార్పు కనిపించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా లోని సీతానగరం, నల్లజర్ల, దేవరపల్లి, రాజానగరం, కడియం మండలాల పరిధిలో అదనపు ఆర్థిక సాయం పొందిన 704 మంది లబ్ధిదారుల్లో కేవలం 150 ఇళ్లు మాత్రమే రూఫ్ లెవెల్ దశను చేరుకున్నాయని అన్నారు. పనితీరు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా లేదని ఆమె స్పష్టం చేశారు. దిగువ స్థాయిలో ఉన్న మండలాల పనితీరు జిల్లా పురోగతిపై ప్రభావం చూపిస్తున్నట్లు తెలిపారు. సొంత ఇంటి కలను సాకారం చేయడం ద్వారా ప్రజలకు భద్రతా భావన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం విడుదల చేసిందని తెలిపారు. ఆయా మండలాలలో లబ్ధిదారులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విధి విధానాలను వివరాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అందుకున్న నిధులను సమర్ధవంతంగా వినియోగించడంతోపాటు, నిర్మాణ పనుల పురోగతిని వేగవంతం చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని చెప్పారు. గృహ నిర్మాణ దశల వారీ పురోగతికి అనుగుణంగా స్టేజ్ కన్వర్షన్ ప్రక్రియ చేపట్టాలని, ఆయా దశల ప్రకారం బిల్లులు సకాలంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఇసుక, సిమెంట్ వంటి ముడి సరుకులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ పిడిఎస్. భాస్కర్‌రెడ్డి, సంబంధిత మండలాల ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం: ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కొవ్వూరు

లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు కొనియాడారు. బుధవారం కొవ్వూరు లీటరరీ క్లబ్ కల్యాణ మండపంలో కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి లయన్స్ క్లబ్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ నూతన కార్యవర్గం రానున్న రోజుల్లో నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం కొవ్వూరు లైన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పెనుమాక జయరాజు, తాళ్లపూడి క్లబ్ అధ్యక్షుడిగా నామన పరమేశ్వరరావు, దేవరపల్లి క్లబ్ అధ్యక్షురాలిగా రామరహిత ప్రమాణస్వీకారం చేశారు. నూతన క్లబ్ అధ్యక్షులను ఎంఎల్‌ఎ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కొవ్వూరు క్లబ్ కార్యదర్శిగా యాగంటి చలపతిరావు, కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి, సూరపనేని చిన్ని, యనమదల వెంకట సుబ్రహ్మణ్యం, కంటమణి రామకిషోర్, మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ముప్పిడి

గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని భీమ క్రోసు పాలెం లో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలిన ఒకరికి తీవ్ర గయాలు అయ్యాయి.. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు అనిశెట్టి సుబ్బలక్ష్మి అనే మహిళ ఇంటిలో జరిగిన ఈ ప్రమాదంలో ఇంటిలోని వారు సురక్షితంగానే ఉండగా.. సాయం చేయడానికి వెళ్లిన పితాని చిన్నబాబుకు గాయాలపాలయ్యారు.. ఆయనను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. సిలిండర్ పేలుడు దాటికి భవనం దెబ్బతింది.

బైక్‌పై వచ్చి సెల్ ఫోన్ చోరీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిచి వెళ్తున్న వ్యక్తి నుంచి బుధవారం సెల్‌ఫోన్ లాక్కుని ఇద్దరు యువకులు బైక్‌పై పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతి పరిధిలోని కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు పై కాకినాడకు చెందిన కాట్నం వెంకటేశ్వర రావు నడిచి వెళుతున్నాడు. ఈ సమయంలో ఇద్దరు యువకులు మోటార్ బైక్ పై వచ్చి పడిపోయినట్లు నటించారు. వారిని లేపేందుకు వారి దగ్గరికి వెళ్లగా,వారు ఆయన జేబులోని సెల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. భాదితుడి పిర్యాదు మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - గండేపల్లి

అదృశ్యమైన మహిళ ఆచూకీని పోలీసులు కనిపెట్టి కేసును ఛేదించారు. మండలంలోని సింగరంపాలెంకు చెందిన వివాహిత ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివ నాగబాబు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వివాహితను హైదరాబాద్‌లో గుర్తించారు. అతి తక్కువ సమయంలో మహిళ ఆచూకీ కనిపెట్టిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు

చెరువులో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట తాగునీటి చెరువులో ఒక వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చెరువులో మృతదేహం తేలుతూ కనిపించడంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక టవర్ కాలనీకి చెందిన ఎల్లె డేవిడ్ రాజు (50)గా గుర్తించారు. రాజు పంచాయితీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్నాళ్ల కిందట జరిగిన బంగారు నగలు చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి 63 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. కెఎల్.పురానికి చెందిన గడ్డం రామ్ నవీన్, నర్సీపట్నంకు చెందిన అలెక్స్‌లను అరెస్ట్ చేశామని ఎస్ఐ హరిబాబు తెలిపారు.

అథ్లెటిక్స్ మీట్‌కు 3న క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆగస్టు 9 నుండి 11వ తేదీ వరకూ బాపట్లలో నిర్వహించే సౌత్ జోన్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆగస్టు 3న స్థానిక మహారాణి కళాశాలలో నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టివిఎస్.రంగారావు, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌వివిజి.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, అండర్-16, అండర్-18, అండర్-20 విభాగాలలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్‌త్రో, జావలిన్ త్రో తదితర అంశాలలో క్రీడాకారుల ఎంపిక చేస్తారన్నారు.

సత్యదేవునికి రూ.1.57 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి హుండీల లెక్కింపు ద్వారా రూ.1.57 కోట్ల ఆదాయం లభించింది. బుధవారం కొండపైన ఇఒ వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు 35 రోజుల్లో వివిధ హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 35 గ్రాముల బంగారం, 659 గ్రాములు వెండి ఇంకా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు

కథాసాహిత్యంలో ధృవతార రావిశాస్త్రి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తెలుగు కథా సాహిత్యంలో ఒక ప్రభంజనం సృష్టించి అందరినీ ఆలోచింపజేసిన అభ్యుదయ కవి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. రమణయ్య పేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రావిశాస్త్రి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో నిత్యం పై తరగతి వారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై చిత్రహింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరపున తన ప్రతి రచనలోనూ వకల్తా పుచ్చుకుని వాదించిన కవి రావిశాస్త్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఇండుగల ప్రసాద్ నాయుడు, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగుల సౌజన్యంతో ఉత్తమ విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఐ.ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన రాష్ట్రంగా దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. నేటి విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసించడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, డాక్టర్ శిరీష, ఎస్.శ్రీనగేష్, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్' ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్ విజయవంతంగా ముగిసింది. రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ ఆర్‌విఎస్.లలిత వ్యవహరించారు. ఈ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ కరపత్రం విడుదల

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రత్తిపాడు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమాల వేగుచుక్క సిఐటియు స్వాతంత్ర ఉద్యమ కాలం నుంచి పుట్టిన కార్మిక వర్గ ఆశయ సాధనతో పని చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్లో పారిశ్రామిక ప్రధాన కేంద్రమైన విశాఖ పట్టణంలో మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, కొవ్వూరు

ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న ఎఒ

ఉండ్రాజవరం మండలంలోని ఉండ్రాజవరం, దమ్మెన్ను గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు, ఉద్యాన శాఖాధికారి డి.సుధీర్ రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా వస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సాంప్రదాయ పద్ధతిలో సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలంలో హారికరేవుల, కుమారదేవం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ ఏడాది ప్రకృతి వైపరిత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందాలంటే పిఎం ఫసల్ బీమా యోజన పథకంలో ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్‌రావు, అరికిరేవుల సొసైటీ సెక్రటరీ చావా ప్రసాద్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు, కొవ్వూరు

మండలంలోని మల్లవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గౌరిపల్లి, మల్లవరం, చంద్రవరం, మార్కుండపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, మిగతా బాలన్స్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సరఫరా చేస్తామని తెలిపారు. బాలన్స్ ఇస్తామని అని తెలిపారు. అలాగే కొవ్వూరు మండలం వాడపల్లి విద్యుత్ స్టేషన్ పరిధిలో 11 కెవి వేములూరు, వాడపల్లి, మద్దూరు, వాడపల్లి లోకల్, మహర్షి వేదపాఠశాల ఫీడర్స్‌కు శుక్రవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాడపల్లి, వేములూరు, తోగుమ్మి, మద్దూరు, మద్దూరులంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా అందిస్తామని తెలిపారు.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE, KAKINADA
A.S.S.R. No.7982/2024
Between:
Shaik Hussain
...Appellant/ Defendant
And
Bugatha Rambabu (died) and others
...Respondents/ Plaintiffs
To:R2: Bugatha Vijaya, W/o. late Rambabu, Hosuewife, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
R3: Bugatha Parvathi Lakshmi Vani, W/o. Panthadi Brahmanandam, Hosuewife, D.No. 18-15-4, Suryanarayanapuram, Kakinada.
R4: Bugatha Shiva Sankar, S/o. late Rambabu, Private Employee, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
R5: Bugatha Udaya Bhaaskara Venkataramana, S/o. late Rambabu, Private Employee, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
పై నెంబరు పిటీషన్‌లో 2 to 5 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్య పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.01-08-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
మేడపాటి రామారెడ్డి
అడ్వకేట్, డో.నెం.23-7-7/1, దుగ్గిరాలవారివీధి కాకినాడ, సెల్: 9059429999

పాస్‌పోర్టు పడిపోయినది
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, కె.ఏనుగుపల్లి కి చెందిన గాధ సురేష్, తండ్రి: పెద్దిరాజు, డోర్ నెం. 2-183 లో నివాసముంటున్నాను. ది. 20-07-2025 తేదిన నేను పాస్‌పోర్టు నెం. **U 1847474** ను జిరాక్స్ తీయించుకొనేందుకు ఏనుగుపల్లి నుండి పి.గన్నవరం వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది. దయచేసి నా పాస్‌పోర్టు దొరికినవారు ఈ క్రింది అడ్రస్సుకు పంప కోరుచున్నాను.
గాధా సురేష్, తండ్రి: పెద్దిరాజు
డోర్ నెం.2-183, కె.ఏనుగుపల్లి,
పి.గన్నవరం మండలం
సెల్.8885915552

లింకు దస్తావేజు పోయినది
శ్రీమతి కుందుం సత్యవతి, W/o. కుందుం కరుణాకర్, డోర్ నెం. 46-5-12 రు, ఉప్పు వీధి, జాంపేట, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క ఒరిజినల్ లింక్ క్రయ దస్తావేజు నెం. 516/1973, Dt. 24-04-1973 రాజమండ్రి సబ్‌రిజిస్ట్రారు ఆఫీస్‌లో రిజిస్టర్ కాబడిన దస్తావేజు ది. 26-7-2025 వ తేదీన జాంపేట రాజమండ్రి నందు నా ఇంటి డోరు నెం. 46-5-12 నుండి ప్రకాష్‌నగర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్లుచుండగా రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్ పార్క్ వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.
కుందుం సత్యవతి
సెల్: 9666091227

పాస్‌పోర్టు పడిపోయినది
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, మూలస్థానం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మాచరరావు, S/o. వీర వెంకట సత్యనారాయణ అను నేను 10-07-2025వ తేదీన నా పాస్‌పోర్టును నెంబరు **Y3423246** ను తీసుకుని ఆలమూరు బైక్‌పై జిరాక్స్ కోసం వెళుతున్న సమయంలో నా పాస్‌పోర్టు ఒరిజినల్ మార్గం మధ్యలో పడిపోయినది. నా పాస్‌పోర్టు కొరకు చుట్టుప్రక్కల అంతా వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల క్రింది అడ్రసుకు ఇవ్వగలరు.
పెద్దిరెడ్డి మాచరరావు,
S/o. వీర వెంకట సత్యనారాయణ
మూలస్థానం గ్రామం, ఆలమూరు మండలం
సెల్: 9381582022

ప్రకటన

కీ॥శే॥ మల్లాడి ధనరాజు (లేటు)
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎన్.కొత్తపల్లి, పెద రాఘవులపేట గ్రామం, డో.నెం. 7-78 కాపురస్తులు మల్లాడి నాగరాజు, S/o. ధనరాజు (లేటు), S/o. కన్నయ్య (లేటు) గారి కుమారుడు మల్లాడి నాగరాజు ఇచ్చిన పత్రికా ప్రకటన.
నా తండ్రి మల్లాడి ధనరాజు గారు ఎన్.కొత్తపల్లి పెద రాఘవులపేట గ్రామంలో మా ఇంటి వద్ద 10-11-2003 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎన్.కొత్తపల్లి గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.
ఇట్లు: మల్లాడి నాగరాజు
S/o. మల్లాడి ధనరాజు (లేటు)
డో.నెం. 7-78, ఎన్.కొత్తపల్లి పెద రాఘవులపేట
ఉప్పలగుప్తం మండలం, సెల్: 9959484273

వేలం ప్రకటన
మహారాజశ్రీ గౌరవనీయులైన రాజమహేంద్రవరం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఈ.పి. నెం. 39/2022
ఓ.యస్.నెం. 406/2012
Between:
దేవలంక పార్వతి వగైరా ...డిక్రీ హోల్డర్స్
మరియు
దేవలంక బాలవీరకుమార్, (తండ్రి) (లేటు) సూర్యారావు, హిందువు, వయస్సు 44 సం॥లు, కేరాఫ్ డి.వి.సి. ఇంజనీరింగ్ కాలేజ్, పాలచర్ల, రాజానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. ...జె.డి.ఆర్
పై నెంబరు డిక్రీ బాకీకి జడ్జిమెంట్ డెటార్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి పై కోర్టు వారు సమక్షములో ది.13-08-2025 తేదీన ఉదయం 10.30 గంటల లగాయితు బహిరంగ వేలము జరుపబడును. ఆశక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చును. మిగతా వివరములకు డిక్రీ హోల్డరు గారి అడ్వకేటు ఆఫీసు నందు గాని, పై కోర్టు నజారతు ఆఫీసు నందు గాని తెలియజేయబడును.
వేలం కాబడు షెడ్యూలు ఆస్తి వివరములు
తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ
ఐటమ్ నెం.1:
తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ డోరు నెం.3-172 క్రొత్త డోరు నెం.3-147 యందు గల చ.గ. 376.27 లు యిందలి ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగు అందుకు హద్దులు:
తూర్పు: రోడ్డు, **దక్షిణం:** ఆదిమూలం వారి ఇల్లు. **పడమర:** యిందలి ఐటమ్ నెం.2, **ఉత్తరం:** గొల్లకోటి సూర్యకాంతం గారి ఇల్లు.
సదరు హద్దుల మధ్య గల చ.గ.376.27 లు లో అనిర్ధిష్టపు 1/4వ వంతు వాటాకు చెందిన ఖాళీ నివేశ్న స్థలము. అందు ఇల్లు మరియు మామూలు ఈజిమెంటు హక్కులతో సహా.
యిటమ్ నెం. 2:
తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ డోరు నెం. 3-172 క్రొత్త డోరు నెం. 3-147 యందు గల చ.గ. 123.72 లు యిందలి ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగు అందుకు హద్దులు:
తూర్పు: యిందలి ఐయిటమ్ నెం. 1, **దక్షిణం:** ఆదిమూలం వారి ఇల్లు, **పడమర:** దేవలంక వెంకట్రావు గారి భూమి. **ఉత్తరం:** గొల్లకోటి సూర్యకాంతం గారి ఇల్లు.
సదరు హద్దుల మధ్య గల చ.గ. 123.72 లు లో అనిర్ధిష్టపు 1/4వ వంతు వాటాకు చెందిన ఖాళీ నివేశ్న స్థలము. అందు ఇల్లు మరియు మామూలు ఈజిమెంటు హక్కులతో సహా.
డిక్రీ హోల్డరు విలువ: రూ. 30,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ. 20,00,000/-
జె.డిఆర్. కిమ్మత్తు: ఇవ్వలేదు
మార్కెట్టు విలువ: రూ. 12,49,975/- లు నిర్ణయించడమైనది.
యం.ఆర్ సత్యసాయి (రాంబాబు)
అడ్వకేట్, డోర్ నెంబరు. 86-11-11/1, వాడ్రేవు నగర్, తిలక్ రోడ్డు, రాజమహేంద్రవరం, సెల్: 9848376941